క్లుప్తంగా

విద్యార్థినికి ఆర్ఐఓ అభినందన


విద్యార్థినిని అభినందిస్తున్న ఆర్ఐఓ

కంభం: ఇంటర్మీడియెట్‌లో హెచ్ఈసీ గ్రూపులో 980/1000 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తమ్మినేని చాతుర్యను సోమవారం ఆర్ఐఓ సైమన్ విక్టర్ విద్యార్థిని ఇంటి వద్దకు వెళ్లి అభినందించారు. విద్యార్థినికి భవిష్యత్ చదువులకు సంబంధించి సలహాలు, సూచనలు అందించారు. భవిష్యత్తులో ఉన్నత చదువులకు సహకారం అందిస్తామన్నారు.

కొండపేట సమీపంలో క్షుద్ర పూజల కలకలం

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని కొండపేట గ్రామ శివారుల్లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి క్షుద్ర పూజలు చేసినట్లు సోమవారం వెలుగులోకి వచ్చింది. తాంత్రిక పూజలు చేసే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిమ్మకాయలు, పసుపు, కుంకుమ, మనిషి పుర్రె చుట్టూ ముగ్గులు వేసి క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించాయి. క్షుద్ర పూజలు చేసిన ప్రదేశాన్ని గమనించి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. క్షుద్రపూజలు చేసే వారిని పోలీసులు అడ్డుకుని చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం


పూజలు నిర్వహిస్తున్న ఉభయదాతలు

కొనకనమిట్ల: మండలంలోని పాతపాడులో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణలతో గ్రామం నలుమూలల నుంచి తెచ్చిన తీర్థంతో సీతారాములకు పట్టాభిషేకం నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ స్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. యువకులు రామ, లక్ష్మణ, శత్రుఘ్న, ఆంజనేయస్వామి వేషధారణలతో కలశాలు ఎత్తుకొని పట్టాభిషేకం నిర్వహించారు. భక్తుల కోలాటం అలరించింది. పానకం బండ్ల ఉత్సవాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లకు పూజలు చేశారు. గులాంలు చల్లుకున్నారు. ముందుగా ఉభయదాతలు ఆలయంలో ఆకుపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. మంగళవారం రథోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

చంద్ర, సింహ వాహనాలపై చెన్నకేశవుడు


మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

మార్కాపురంటౌన్: లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా భూదేవీ, శ్రీదేవీ సమేతులైన స్వామివారు ఆదివారం రాత్రి చంద్ర వాహనంపై శ్రీమన్నారాయణమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం పగలు ఉత్సవం నిర్వహించారు. రాత్రి సింహ వాహనంపై స్వామివారు నృశింహుని అలంకారంలో నాలుగు మాడవీధుల్లో ఊరేగారు. భక్తులు స్వామి వారికి టెంకాయలు సమర్పించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం శేష వాహనంపై చెన్నకేశవస్వామి, శ్రీ కాళీయమర్ధన అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

గాలివానకు నేలకొరిగిన బొప్పాయి

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి ఈదుగాలులతో వర్షం కురిసింది. గాలివానకు పలు గ్రామాల్లో సాగు చేసిన బొప్పాయి తోటలకు నష్టం వాటిల్లింది. కాయదశలో ఉన్న బొప్పాయి పంట గాలులకు నేలకొరగడంతో పక్వానికి వచ్చిన కాయలు పనికి రాకుండా పోయాయని సిద్ధవరం, కొనకనమిట్ల, పెదారికట్ల గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గనివానిపాడులో వర్షం ధాటికి రేకుల ఎగిరిపోవడంతో అందులో ఉన్న పొగాకు బేళ్లు తడిసిపోయాయని గ్రామానికి చెందిన రైతు కోటేశ్వరరావు వాపోయాడు. జామ, బెండ తోటల్లోకి వర్షం నీరు చేరిందని సర్పంచ్ పాలూరి లక్ష్మీ సాంబ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉపాధి మాయ


పనులకు వెళ్లిన కూలీలు


వాటర్ షెడ్ పనుల్లో ఉపాధి కూలీలు

- ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు
- పాత పనులనే కొత్తవిగా చూపి బిల్లులు
- పనులు నిల్ మస్టర్ షీట్ ఫుల్
- చేతివాటం ప్రదర్శిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు


ఒకే ఫొటోతో వేసిన మస్టర్లు


ఖాళీ ఫొటోతో మస్టర్లు

కొనకనమిట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూటమి నాయకుల కనుసన్నల్లో అధికారుల సహకారంతో వారు పెట్టిన మేట్లు ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారు. 'నీకో సగం.. మాకో సగం' అంటూ తమ జేబులు నింపుకుంటున్నారు. రేగుమానిపల్లిలో వాటర్‌షెడ్ ద్వారా చేసిన పనులను ఉపాధిలో చేసినట్లు మస్టర్లు వేసుకుంటున్నారు. మస్టర్ పనుల్లో ఆన్‌లైన్ వ్యవస్థను కూడా తప్పుదారి పట్టించేలా ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. పాత పనులనే కొత్త పనులుగా చూపుతూ ఒకే ఫొటోతో అప్‌లోడ్ చేసి మస్టర్లు వేస్తుండటం గమనార్హం. పలు గ్రామాల్లో స్థానికంగా లేకున్నా మస్టర్లు వేస్తూ వారు పనికి వచ్చినట్లుగా జాబ్‌కార్డు నంబర్లు పెట్టి వారి స్థానంలో మరొకరు ఫొటోలు దిగుతున్నారు. నగదు వచ్చిన సమయంలో మేట్‌లు కొంత తీసుకుని ఫీల్డ్ అసిస్టెంట్లకు పంచుతున్నారు. పనులకు వెళ్లేది 20 మంది అయితే 50 మందికి దొంగ మస్టర్లు వేసి నగదు పంచుకుంటున్నారు. పలుచోట్ల కూటమి నాయకులు కమీషన్లు తీసుకుంటున్నట్లు పుకార్లు వస్తున్నాయి. అంతే కాకుండా గోకులం షెడ్ల ఏర్పాటులోనూ చేతివాటం చూపుతున్నారు. ఒక్కొక్క గోకులం షెడ్‌కి రూ.20 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలో 26 గ్రామ పంచాయతీలకుగాను 24 జీపీలలో పనులు చేస్తున్నారు. జాబ్‌కార్డులు 13,005 ఉండగా 24,253 మందికి మస్టర్లు ఉన్నాయి. 50 మంది చొప్పున 176 గ్రూపులు ఉండగా 8800 కూలీలు పనులకు వెళుతున్నారు. మొత్తం 100 రోజుల పని దినాలకు స్పందించి 7,74,000 మందికి రూ.38.70 కోట్ల నిధులు కేటాయించనున్నారు. అలాగే 8 గ్రామాల్లో 35 గోకులం షెడ్ల ఏర్పాటుకు రూ.80 లక్షల వరకు మంజూరయ్యాయి. అవి కూడా తాత్కాలికంగా ఏర్పాటు చేసి సొంత అవసరాలకు ఉపయోగించుకుంటున్నట్లు స్థానికంగానే విమర్శలు వస్తున్నాయి. ఉపాధి పనుల్లో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించి అవకతవకలపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న అక్రమాలపై ఏపీఓ బుల్లెన్నరావ్ వివరణ ఇస్తూ పలు గ్రామాల్లో ఉపాధి పనుల్లో అవకతవకలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని గ్రామాల్లో విచారణ చేపట్టి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు.


తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గోకులం షెడ్

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


మండల కన్వీనర్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

అర్ధవీడు: ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక సాయి ఫంక్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చమని ప్రశ్నిస్తున్న వారిపై కూటమి నేతలు అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా ఎవరూ భయపడాల్సిన పనిలేదని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం నూతనంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా ఎంపికైన ఏరువ రంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. నూతన కన్వీనర్ మాట్లాడుతూ మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకట్రావు, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, సర్పంచులు వసంతమ్మ, నాగమల్లేశ్వరి, వెంకటేశ్వర్లు, రామక్రిష్ణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ సన్నెబోయిన రవికుమార్, ఎంపీటీసీ చంద్ర, కో ఆప్షన్ సభ్యుడు జిలాని, రామక్రిష్ణ చౌదరి, రబ్బాని, బొంబాయి వలి, కాల్వ కాశీరావు, రమేష్ రెడ్డి, రామలింగేశ్వరరెడ్డి, బొగ్గు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం టౌన్: అగ్నిప్రమాదాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ నాగరాజు సూచించారు. సోమవారం నుంచి అగ్ని ప్రమాద అవగాహన వారోత్సవాల ప్రారంభం సందర్భంగా స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఫైర్ ఆఫీసరు రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు.

గిద్దలూరు రూరల్: ప్రజలు అగ్ని ప్రమాదాల పై అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి హరిబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయం ఆవరణలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

స్టేట్ ర్యాంకర్‌కు అభినందన

బేస్తవారిపేట: స్థానిక ఆల్ఫా స్కూల్ వీధికి చెందిన తమ్మిరెడ్డి చాతుర్య ఆర్ట్స్ గ్రూప్‌లో స్టేట్ మొదటి ర్యాంకు సాధించడంతో కంభం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానం చేశారు. తండ్రి లక్ష్మీరెడ్డి, కుటుంబ సభ్యులను, ఎకనామిక్స్‌లో వందకు 99 మార్కులు సాధించినందుకు అధ్యాపకురాలు బొగ్గ శివలక్ష్మిలను శాలువ, పూలమాలలతో అభినందించారు. సీనియర్ లయన్ మొగల్ చిన్న హుస్సేన్‌బేగ్ రూ.10 వేలను, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు గంజి హస్వంత్‌రెడ్డి, మానసలు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ పులి శ్రీనివాస ప్రసాద్, అధ్యక్షుడు బీ వెంకట రామకృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం


మార్కాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాంబాబు, జంకె, షంషేర్ తదితరులు


మార్కాపురంలో అన్నదానం ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా


అర్ధవీడులో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


డాక్టర్ పులుగుజ్జు సురేష్‌ను సన్మానిస్తున్న రిటైర్డ్ అదనపు డీజీపీ, తదితరులు


వాసవీ విద్యానికేతన్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది

- వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు
- ఘనంగా నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె, కేపీ

మార్కాపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహనీయుడని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, ఆశయాలను కొనసాగించేందుకు అందరం కృషి చేస్తామని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం కోర్టు సెంటర్, ఆర్టీసీ బస్టాండుల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు ఏపీఐఐసీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డితో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఏపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, పార్టీ బూత్‌కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పత్తి రవిచంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, కౌన్సిలర్లు ముంగమూరి శ్రీనివాసులు, జగనన్న దళిత సేన అధ్యక్షుడు బూదాల సతీష్, పార్టీ నాయకులు పోరెడ్డి చెంచిరెడ్డి, ఉత్తమ్‌కుమార్, కూరాటి చెన్నకేశవులు, తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, నల్లబోతుల కొండయ్య, యం.వరప్రసాద్, పంబి వెంకటరెడ్డి, సాంబశివారెడ్డి, పవన్, సురేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. జగనన్న దళిత సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని అన్నా రాంబాబు ప్రారంభించారు.

మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, పలువురు కౌన్సిలర్లు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి సీఐ సుబ్బారావు, ఎస్సైలు రాజమోహన్‌రావు, సైదుబాబు పూలమాలలు వేశారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కే ఎర్రయ్య, సీపీఐ నాయకులు అందె నాసరయ్య తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. వెలుగు కార్యాలయంలో రిటైర్డు తహశీల్దార్ జయపాల్, ఉద్యోగ సంఘం నాయకులు బాలరాజు, హెచ్‌ఎం ఎం సజీవరాజు, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, సీసీ నాగభూషణం తదితరుల ఆధ్వర్యంలో, కోర్టు సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి సయ్యద్ జావీద్ అన్వర్, నూతలపాటి దేవరాజ్, షేక్ ఇస్మాయిల్, సయ్యద్ అలీ జహీర్ తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. వాసవీ విద్యానికేతన్‌లో డైరెక్టర్ కే రంగయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ రంజిత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో..

డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, డీన్ మస్తానయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో చెంచు గిరిజనుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు అనుముల రవికుమార్ ఆధ్వర్యంలో, కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జవ్వాజి రాజు, డీకేఎం రఫీ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పీ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

తర్లుపాడు: అంబేడ్కర్ జయంతి వేడుకలను తర్లుపాడులో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. తర్లుపాడులో అంబేడ్కర్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సెంటరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి యువత ఘనంగా నివాళులర్పించారు. లక్ష్మక్కపల్లిలో హెచ్‌ఎం జగన్‌బాబు, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ భూలక్ష్మి అధికారులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

పొదిలి: అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభన్‌బాబు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ షాజిదా ఆధ్వర్యం, ఏబీఎం పాఠశాల వద్ద అంబేడ్కర్ విగ్రహానికి సీఐ వెంకటేశ్వర్లు, బీజేపీ అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వేమన, వెలుగు కార్యాలయంలో ఏపీఎం గోపాలరెడ్డి అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్‌కు నివాళులు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఉప్పలపాడు, సూదనగుంట పంచాయతీల్లో అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఉప్పలపాడులో కనిగిరి డివిజన్ లెవల్ పంచాయతీ అధికారి కేవీఎస్ హనుమంతరావు, సర్పంచ్ గుంటూరి ఏసోబు, పంచాయతీ కార్యదర్శి శేషగిరి, ఎద్దు నగేష్ పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్

కొనకనమిట్ల: అంబేడ్కర్ అసోసియేషన్ నాయకులు మంచికల మణిశేఖర్, పిల్లి బాలనరసయ్య, కోండ్రు వెంకటేశ్వర్లు, వాగుమడుగు సర్పంచ్ భూదాల కమలాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కొనకనమిట్లలో అంబేడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు పిల్లి బాలనరసయ్య, కొండయ్య, ఏసేబుల అధ్యక్షతన, స్థానిక గుజ్జుల యలమందారెడ్డి స్మారక భవనంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ పర్యవేక్షణలో, నాగంపల్లి ఎస్సీ కాలనీలో ఎంపీటీసీ కోండ్రు వెంకటేశ్వర్లు, వాగుమడుగు సచివాలయంలో సర్పంచ్ భూదాల కమలాకర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు.


పొదిలి తహసీల్దార్ కార్యాలయంలో..

ఘనంగా అంబేడ్కర్ జయంతి వేడుకలు

బేస్తవారిపేట: బేస్తవారిపేటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద, గ్రంథాలయంలో, పంచాయతీ కార్యాలయంలో, బీసీ హాస్టల్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ ఆశయ సాధనసమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు డీ ఖాజామీయా, అంబేడ్కర్ ఆశయసాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుళ్ల చిన్న సుబ్బయ్య, ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు బూదాల ఆనంద్, నాయకులు మిరియాల శేఖర్, దార్ల ప్రేమ్‌కుమార్, కువ్వారపు రమేష్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

అర్ధవీడులో..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాల మహానాడు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై బీ సుదర్శన్ యాదవ్, ఏపీఓ శ్రీనివాసరెడ్డి, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘాల వెంకట కృష్ణ, నాయకులు ఎల్ చామ రాజేంద్రరాజు, ఎస్ సాల్మన్‌రాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

గిద్దలూరులో...

గిద్దలూరు రూరల్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక క్లబ్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు కౌన్సిలర్ మానం బాలిరెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎస్సీ, బాలుర, బాలికల వసతి గృహాల్లో ఏఎస్‌డబ్ల్యూఓ నాయుడు అమ్మాజి ఆధ్వర్యంలో, బీజేపీ నాయకులు క్లబ్‌రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.నోవెల్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గర్రె చిరంజీవి, యర్రం వెంకటరామిరెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, కాతా నరసింహారెడ్డి, పోలేపల్లె శివ, సునిల్‌రెడ్డి, సూరేపల్లె రామక్రిష్ణ, మిత్రరెడ్డి, మత్తయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు లతీఫ్‌ఖాన్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

అర్ధవీడు: అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ సమన్వయకర్త కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి

రాచర్ల: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు పల్నాటి మహబుబ్‌పీరా అన్నారు. అనుమలవీడు గ్రామంలోని ఎస్సీకాలనీలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు బత్తుల శివరాజ్ యాదవ్, సూర మధుసూదన్‌రెడ్డి, ఎమ్.ప్రభుదాస్, కటారు నారాయణరెడ్డి, ప్రభాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

కంభంలో..

కంభం: అంబేడ్కర్ జయంతిని సోమవారం కంభంలో ఘనంగా నిర్వహించారు. షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు ఆధ్వర్యంలో కందులాపురం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. స్థానిక రావిపాడు రోడ్డులోని ఎస్సీ హాస్టల్‌లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్ఐఓ సైమన్‌విక్టర్, ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీఓ వీరభద్రాచారి, సర్పంచ్ బత్తులతిరుపాలమ్మ(రజని), ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, ఎస్సై నరసింహారావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెంరాజు, వార్డెన్‌లు కోటిరెడ్డి, రామానాయక్, హేమలత, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా అంబేడ్కర్ జయంతి వేడుకలు

కొమరోలు: కొమరోలు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ మౌలాలి, తిరుపతిరాజు పాల్గొన్నారు. కొమరోలులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కామూరి అమూల్య, ఎంపీడీఓ మస్తాన్‌వలి, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య ఆధ్వర్యంలో రెవిన్యూ సిబ్బంది, కొమరోలు సచివాలయంలో ఈఓపీఆర్డీ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో, బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.


తర్లుపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ భూలక్ష్మి


ఉప్పలపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎల్‌పీఓ


గిద్దలూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజ్యాంగం జీవితంలో భాగం కావాలి
– రిటైర్డ్ అదనపు డీజీపీ డాక్టర్ కే బాబురావు

కంభం: రాజ్యాంగం జీవితంలో భాగస్వామ్యం కావాలని రిటైర్డ్ ఐపీఎస్ (మాజీ అదనపు డీజీపీ) అధికారి డాక్టర్ కే బాబురావు అన్నారు. పీపుల్స్ యాక్షన్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక యూటీ ఫంక్షన్ హాలులో సోమవారం నిర్వహించిన అండ్కేర్ 134వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పీపుల్స్ యాక్షన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పులుగుజ్జు సురేష్, అడ్వొకేట్ ఉదయగిరి మల్లిఖార్జున, పీఏఎఫ్ నాయకులు కొత్తపల్లి విజయ్, బుజ్జి, నవీన్, శేఖర్ పాల్గొన్నారు. ముందుగా కందులాపురం కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు.


బేస్తవారిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ


కంభంలో అంబేడ్కర్ జయంతిలో మాట్లాడుతున్న ఎంపీపీ


కొనకనమిట్లలో అంబేడ్కర్‌కు నివాళులు


రాచర్ల అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పల్నాటి మహబుబ్‌పీరా


కొమరోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ వెంకట నాయుడు